

వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళ..



భారీ వర్షంలో గొడుగు అడ్డు పెట్టుకుని వెళ్తూ..



వర్షానికి తడవకుండా నెత్తిన మూటే ఆధారంగా..



నగరంలో భారీ వర్షం



వర్షంలో వెళ్తున్న వాహనాలు

ఎండవేడి నుంచి ఉపశమనం

- శివార్లలో పెనుగాలులు
- స్తంభించిన విమాన సేవలు

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లోనూ బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 9.30 గంటల వరకు ఎండవేడికి ఉక్కపోతకు గురైన నగరవాసులకు ఈ అకాల వర్షం ఊరట కలిగించింది. రహదారుల్లో వర్షపునీరు వరదలా ప్రవహించడంతో నగరంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎగ్మూరు, వాషర్‌మెన్‌పేట, గిండి, కోయంబేడు, మాధవవరం తదితర ప్రాంతాల్లో అరగంటకు పైగా భారీగా వర్షం కురిసింది. పెనుగాలులతో కూడిన వర్షానికి నగరవాసులు తడిసిముద్దయ్యారు. ఆవడిలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రోడ్డు పక్కన ఉన్న బ్యానర్లు పెనుగాలులకు ఎగిరిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు అందించిన వివరాల ప్రకారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మేడవాక్కంలో 13 సెం.మీలు, వలసరవాక్కంలో 11 సెం.మీ.లు, సాలిగ్రామం, నెర్‌కుండ్రం ప్రాంతాల్లో 10 సెం.మీ.లు, మనలిలో 9 సెం.మీ.లు, ప్యారీస్ కార్నర్‌లో 8 సెం.మీలు, అన్నావర్సిటీ, రాజాఅన్నామలైపురంలో 7 సెం.మీ.లు, నుంగంబాక్కం, పళ్ళికరణైలో 6 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇదే విధంగా కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి.

విమానాల రాకపోకలకు అంతరాయం...

నగరంలో శివారు ప్రాంతాల్లో కురిసిన ఈ అకాల కుంభవృష్టికి ఐదు విమానసర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ముంబయి నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం, హైదరాబాద్ నుంచి, గౌహతి నుంచి, బెంగళూరు నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాలు వర్షం కారణంగా రన్‌వే అస్పష్టంగా కనిపించడంతో ల్యాండింగ్ కాలేకపోయాయి. దీంతో గంటల తరబడి ఈ ఐదు విమానాంలో ఆకాశంలోనే చక్కర్లు కొట్టాయి. ముంబయి నుండి వచ్చిన ఎయిరిండియా విమానం మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌లో దిగే పరిస్థితి లేక ఆ విమానాన్ని బెంగళూరుకు మళ్ళించారు. ఇదే విధంగా ఢిల్లీ, ముంబాయి, కొచ్చిన్, కోవై, దోహా నగరాలకు వెళ్లాల్సిన విమానాలు వర్షం వల్ల ఆలస్యంగా బయలుదేరాయి. విమాన సేవలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం

- ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టిన స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగరపాలక, నగరపంచాయతీ తదితర స్థానిక సంస్థల్లో దివ్యాంగులను ప్రత్యక్షంగా ఎంపిక చేయడానికి బదులుగా నియామక పద్ధతిలో ఎంపిక చేసేలా శాసనసభలో చట్ట సవరణ ముసాయిదా బిల్లును బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ అన్ని సుదుపాయాలు, అన్ని చోట్లా అన్ని కులాలవారికీ ప్రాధాన్యం అనే లక్ష్యసాధన దిశగా ద్రావిడ తరహా పాలన అందిస్తున్న డీఎంకే ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అంగవైకల్యం కలిగినవారు, ప్రత్యామ్నాయ ప్రతిభావంతులు అనే పేర్లతో పిలుబడిన అంగవిహీనులకు దివ్యాంగులు అనే పేరు పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికే దక్కుతుందని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి గత ప్రభుత్వం రూ.667కోట్ల మేర నిధులను కేటాయించిందని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ నిధులను రూ.1432 కోట్లకు పెంచిందని తెలిపారు. దివ్యాంగులకు కారుణ్య ప్రాతిపదికన కాకుండా హక్కుల ప్రాతిపాదికగా వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే అత్యధిక సంఖ్యలో దివ్యాంగులకు ప్రతినెలా ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని తెలిపారు. వీటన్నింటికీ కంటే దివ్యాంగులవాణి స్థానిక సంస్థల్లోనూ వినిపించేలా ఓ చట్ట సవరణ చేయదలిచానని, ఆ మేరకు నగర పాలక, నగర పంచాయతీ శాఖల తరఫున రెండు చట్ట సవరణల ముసాయిదా బిల్లులను ప్రవేశపెడుతున్నట్లు సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ఈ చట్ట సవరణల ద్వారా గ్రామ పంచాయతీ, పంచాయతీ యూనియన్లు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో దివ్యాంగులకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎంపిక చేయకుండా నామినేటెడ్ (నియామక) పద్ధతిలో ఎంపిక చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం స్థానిక సంస్థలలో 35 మంది ఎన్నికైన దివ్యాంగులున్నారని, ఈ చట్టం అమలులోకి నగర పంచాయతీల్లో ఆ సంఖ్య 650కి పెరుగుతుందన్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీలలో 12913 మంది, పంచాయతీ యూనియన్లలో 388 మంది, జిల్లా పరిషత్‌ల్లో 37 మంది దివ్యాంగులను నామినేట్ చేస్తామన్నారు.

సీఎం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తా

- జస్టిస్ కురియన్ జోసెఫ్



చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ అధికారిక సంబంధాలను మెరుగుపరిచే అంశాలపై అధ్యయనం చేయడానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఏర్పాటు చేసిన కమిటీకి నేతృత్వం వహించడం గౌరవంగా భావిస్తానని జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఐదేళ్ల సేవలందించిన జస్టిస్ కురియన్ జోసెఫ్ 2018లో పదవీ విరమణ చేశారు. విద్యా, చట్ట సంబంధిత సేవలకు సంబంధించి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. 2017లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు వ్యతిరేకంగా పోరాడిన నలుగురు న్యాయమూర్తుల్లో కురియన్ జోసెఫ్ ఒకరు. న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత ఉండాలని, కొలీజియంలో సంస్కరణలు అత్యంత అవసరమని ఆయన గట్టిగా వాదించారు. అంతేకాకుండా ముత్తలాక్ పేరుతో విడాకులిచ్చే పద్ధతికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించిన ఘనత కూడా ఆయనకే దక్కింది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నడుమనున్న సంబంధాలపై అధ్యయనం చేయడానికి స్టాలిన్ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం హర్షదాయకమని ఆయన ప్రశంసించారు. ఆ కమిటీకి అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడాన్ని తనకిచ్చిన అరుదైన గౌరవంగానే భావిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో స్టాలిన్ ఆలోచనా ధోరణికూడా ప్రశంసనీయమన్నారు. స్టాలిన్ కంటే ముందుగా ఆయన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్ర రాష్ట్ర సంబంధాలపై పీవీ రాజమన్నారు కమిటీని నియమించారని, ఆ కమిటీ నివేదికలు సమర్పించి ఇప్పటికి ఎన్నో దశాబ్దాలు గడిచినా అవి ఆచరణకు నోచుకోలేకపోయాయన్నారు. పౌరులందరి అభిలాష పూర్తిచేసేలా రాజ్యాంగం ఉండాలని, అదే సమయంలో సమాజంలో మార్పులకు అనుగుణంగా సవరించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. తన అధ్యక్షతన ఏర్పాటవుతున్న కమిటీ రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణపైనా, కేంద్ర రాష్ట్రాల నడుమ సత్సంబంధాలు నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తుందని వివరించారు. ఈ కమిటీ ఏర్పాటుపై స్టాలిన్ తనను ఫోన్‌లో సంప్రదించినప్పుడు ఈ బాధ్యతను తాను గౌరవ ప్రదమైనదిగానే భావిస్తానని, ఎలాంటి జీతభత్యాలు తీసుకోకుండా సేవలందిస్తానంటూ స్పష్టం చేశానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

దేశ విద్యాభివృద్ధికి రాష్ట్రం దిక్సూచి

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



ఉప కులపతుల సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేశ విద్యాభివృద్ధికి రాష్ట్రం దిక్సూచి లాంటిదని, ఉన్నత విద్యను ప్రపంచ ప్రమాణాలకు పెంచేలా ప్రముఖ విద్యావేత్తల సలహాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లతో సచివాలయంలో భేటీ అయిన సీఎం మాట్లాడుతూ... ఉన్నత విద్యా ర్యాంకుల్లో తమిళనాడు అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో 31 ఉన్నత విద్యా సంస్థలు, సుమారు 500 ఇంజనీరింగ్ కళాశాలలున్నాయని, ఉన్నత స్థాయిలో జాతీయ స్థాయి సగటు కంటే రాష్ట్రం అధిక స్థాయిలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ర్యాంకుల జాబితాలో మొదటి వంద స్థానాల్లో రాష్ట్రానికి చెందిన 22 ఉన్నత విద్యా సంస్థలున్నాయన్నారు. యువత భవిష్యత్ ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకే ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. కాలానికనుగుణంగా కొత్త సాంకేతికతను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ప్రపంచ అభ్యాస పద్ధతులు, శాస్త్రీయ సాంకేతికతను రాష్ట్రంలో అమలుచేయాలని నిర్ణయించామన్నారు. ఈ మార్పులతో విద్యార్థులు ప్రయోజనం పొందాలన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ఈ సమావేశం నాంది కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకురావడానికి అత్యవసర చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. ఏఐ సాంకేతికతో కూడిన పాఠ్యాంశాలు రూపొందించాలని విద్యావేత్తలను కోరారు. 2033 నాటికి తమిళనాడును ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. యువత జీవితాలు తీర్చిదిద్దే బాధ్యత విశ్వవిద్యాలయాలదేనన్నారు. ద్రావిడ మోడల్ పాలన ఉన్నత విద్య, పరిశోధనలకు స్వర్ణయుగం కావాలన్నారు. విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో మార్పులు జరగాలని, అందు కోసం విద్యావేత్తల సలహాలు తీసుకుంటామన్నారు. విద్యావేత్తలు అందించిన సూచనలతో తదుపరి సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాల నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులు ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో ఆమోదం పొందాయి. ఆ మేరకు యూనివర్శిటీలకు ముఖ్యమంత్రి ఛాన్స్‌లర్ అయ్యారు. ఈ నేపథ్యంలో యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్‌లతో భేటీ అయిన సీఎం వారికి తమ ప్రభుత్వ విధానాలను స్పష్టం చేయడంతో పాటు భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, న్యాయశాఖ మంత్రి రఘుపతి, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ మంత్రి స్వామినాథన్, మత్స్యశాఖ, పశుసంవర్థక శాఖ మంత్రి అనిత ఆర్.రాధాకృష్ణన్, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సి.సమయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా మాటలను వక్రీకరిస్తున్నారు

అధికారంలో భాగస్వామ్యం ఇవ్వబోం ● ఎడప్పాడి స్పష్టీకరణ



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, మిత్రపక్షాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించే ప్రసక్తే లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) స్పష్టం చేశారు. బుధవారం ఉదయం శాసనసభ నుంచి అన్నాడీఎంకే సభ్యులంతా వాకౌట్ చేసిన తర్వాత అసెంబ్లీ బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ... వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకే, బీజేపీ తదితర పార్టీలతో ఏర్పాటయ్యే మెగా కూటమి విజయం సాధిస్తుందని, ఆ తర్వాత అన్నాడీఎంకే - బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. అదే సమయంలో మిత్రపక్షాల్లో ఏ పార్టీకి కూడా అధికారంలో భాగస్వామ్యం కల్పించే ప్రసక్తి లేదన్నారు. ఇటీవల నగరంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనను ప్రసార మాధ్యమాలు వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. అమిత్ షా రాష్ట్రంలో అన్నాడీఎంకే, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఎలాంటి ప్రస్తావనా చేయలేదన్నారు. 'ఢిల్లీకి మోదీ, తమిళనాడు ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వం వహిస్తారు' అంటూ అమిత్‌షా స్పష్టమైన ప్రకటన చేశారన్నారు. తాను కూడా అధికారంలో బీజేపీకి భాగస్వామ్యం కల్పిస్తామంటూ ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. డీఎంకే ప్రభుత్వాన్ని తొలగించడమే ఏకైక లక్ష్యంగా భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగుతామని వెల్లడించారు. ఏయే పార్టీలు అన్నాడీఎంకే కూటమిలో చేరుతాయనే విషయాన్ని ఇప్పటికిప్పుడు ప్రకటించలేనన్నారు. అన్నాడీఎంకే కూటమి బలమైన కూటమా? లేక బలహీనమైన కూటమా? ఎన్నికల ఫలితాల్లో తేలుతుందని, అంతవరకూ డీఎంకే నేత స్టాలిన్ ఓపిక పట్టడం మంచిదన్నారు.

డీఎంకేకు ఎందుకింత కడుపుమంట?

అన్నాడీఎంకే ఏ పార్టీతో పొత్తుపెట్టుకున్నా తప్పుపట్టడమే పనిగా పెట్టుకున్న పాలకపక్షమైన డీఎంకే బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నందుకు ఓర్వలేక కడుపుమంటతో రగిలిపోతున్నారని ఈపీఎస్ విమర్శించారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే బలమైన పార్టీ అని, మూడు దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన పార్టీ అని గుర్తు చేశారు. బీజేపీతో అన్నాడీఎంకే పొత్తుపెట్టుకున్నప్పటి నుంచి డీఎంకే పాలకులు భయంతో వణికిపోతున్నారన్నారు. ముగ్గురు మంత్రులపై అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని రెండు రోజులుపాటు అడుగుతున్నా స్పీకర్ అప్పావు పట్టించుకోకుండా ప్రధాన ప్రతిపక్షంపై నిర్లక్ష్యధోరణిని అవలంబిస్తున్న, పాలకపక్షానికి మద్దతుగానే ఆయన వ్యవహరిస్తున్నారని ఈపీఎస్ ఆరోపించారు. ముగ్గురు మంత్రులపై అవిశ్వాసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతించని స్పీకర్ తీరును వ్యతిరేకిస్తూ తమ పార్టీ సభ్యులందరూ వాకౌట్ చేసినట్లు ఈపీఎస్ తెలిపారు.



డీఎంకే కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు, పాలవాక్కం మాజీ పంచాయతీ అధ్యక్షుడు పాలవాక్కం కె.సోము సతీమణి వసంతి అనారోగ్యంతో బుధవారం చెన్నైలో మృతిచెందగా, ఆమె మృతదేహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్. (చిత్రంలో) ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే వేల్‌మురుగన్ తదితరులు

సమాచార దృష్టి

9 జ్యోతిర్లింగాల సందర్శనకు ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మదురై నుంచి చెన్నై మీదుగా నడపనున్న ప్రత్యేక ఆధ్యాత్మిక రైలులో 9 జ్యోతిర్లింగాలు సందర్శించవచ్చు. 12 రోజుల యాత్ర మదురై నుంచి జూన్ 1న బయల్దేరనుంది. రైలు దిండుగల్, విరుదాచలం, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ మీదుగా వెళుతుంది. ఏసీ బోగీలో ఒకరికి రూ.37,280, స్లీపర్ బోగీలో రూ.26,990 చార్జీగా నిర్ణయించారు. రవాణా, బస, భోజనం, ట్రావెలింగ్ బీమా తదితరాలుంటాయి. వివరాలకు 73058 58585 నెంబరుకు సంప్రదించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 5,700 మంది

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఈ ఏడాది 5,700 మంది పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లనున్నట్లు హజ్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. హజ్ యాత్రికులు బుధవారం నుంచి 30వ తేది వరకు సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానాల ద్వారా హజ్ యాత్రకు వెళ్లనున్నారు. హజ్ యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యే భక్తులకు జూన్ 22 నుంచి జూలై 9 వతేది వరకు విమానాలు ఏర్పాటుచేశామన్నారు. రాష్ట్రంలోని దూరప్రాంతాల నుంచి హజ్ యాత్రకు వెళ్లే భక్తులు, ప్రయాణానికి ఒకరోజు ముందుగా వచ్చి చూలైమేడులోని హజ్ హౌస్‌లో బస చేసేందుకు వసతులు కల్పించినట్లు హజ్ కమిటీ తెలిపింది.

బీసెంట్ నగర్‌లో వసతుల కల్పనకు రూ.120 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలం 174వ వార్డులోని బీసెంట్ నగర్ నాలుగో ప్రధాన రోడ్డు, 24వ క్రాస్ వీధి రోడ్డు పక్కన పార్కులున్నాయి. ఈ పార్కుల అభివృద్ధికి కార్పొరేషన్ రూ.47 లక్షలు కేటాయించింది. అలాగే, బీసెంట్ నగర్ 1వ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ మెరుగుపరిచేందుకు రూ.25 లక్షలు, స్టీల్ హ్యాండ్ రైల్స్ ఏర్పాటుకు రూ.23 లక్షలు కేటాయించారు. 32వ క్రాస్ వీధిలోని మల్టీపర్పస్ భవనం అభివృద్ధికి రూ.25 లక్షలు కేటాయించినట్లు, ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని మండల అధికారులు తెలిపారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో మరో వంద సీసీ కెమెరాలు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో మరో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వే పోలీసులు నిర్ణయించారు. సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల భద్రత, గంజాయి అక్రమ తరలింపు, చోరీలు అడ్డుకొనేలా ప్రస్తుతం 90 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, భద్రత మరింత కట్టుదిట్టం చేసేలా మరో 100 కెమెరాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించా రు. ప్లాట్‌ఫారాలు, ప్రవేశద్వారాలు,పార్శిల్‌కేంద్రం ప్రాంగ ణం, సమీపంలోని సబర్బన్ రైల్వేస్టేషన్‌లోని పలు ప్రాంతాల్లో అదనపు కెమెరాలు ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించినట్లు, మరో రెండు నెలల్లో కెమెరాల ఏర్పాటు పూర్తవుతుందని రైల్వే పోలీసులు తెలిపారు.

ఒకే సమయంలో రేషన్ సరుకులు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణంలో ఒకే సమయంలో అన్ని సరుకులు పొందేలా చర్యలు చేపట్టినట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... రాష్ట్రంలో 37,328 రేషన్ దుకాణాలుండగా, వాటిలో 2,035 తాత్కాలిక రేషన్ దుకాణాల్లో మాత్రమే పాయింట్ ఆఫ్ సేల్ పరికరం అందుబాటులో లేదన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్న సరుకులు ఒకే సమయంలో అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆ ప్రకారం, ప్రతి నెలా 15వ తేది నుంచి వినియోగదారుల వాణిజ్య సంస్థ రేషన్ దుకాణాలకు సరుకులివ్వడం ప్రారంభించేలా ఉత్తర్వులు జారీచేశామన్నారు. ఆ ప్రకారం, 1 నుంచి బియ్యం, చక్కెర, గోధుమలు, పామాయిల్, కందిపప్పు తదితరాలు ఒకే సమయంలో అందించాలని ఆదేశించామని, సరకులు నిల్వ ఉన్నా, లేవు అని చెప్పే ఉద్యోగులపై చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.

ఉచితంగానే మెరీనా బీచ్ సందర్శన

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరాన్ని ఉచితంగా సందర్శించవచ్చని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) స్పష్టం చేసింది. ఆసియాలోనే రెండో అతిపెద్ద తీరంగా పేరుగాంచిన మెరీనా బీచ్‌కు ప్రతిరోజు నగరవాసులు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారాంతంలో, పండుగల సమయాల్లో వేలాది మంది మెరీనా బీచ్‌కు వస్తుంటారు.ఈబీచ్ సందర్శనకు ఎలాంటి ఫీజు వసూలు చేయకపోవడంతో ఎక్కువ మంది సందర్శిస్తున్నారు.ఈనేపథ్యంలో, మెరీనా బీచ్ స్విమ్మింగ్ పూల్ సమీపంలోని ఒక నిర్దిష్ట ప్రాంతానికి వెళ్లేందుకు ఫీజు వసూలు చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. ఈ విషయమై జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ విడుదల చేసిన ప్రకటనలో... మెరీనా బీచ్ పలు వసతులతో పాటు బ్లూ బీచ్ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టామని, నిర్వహణ ఖర్చు కార్పొరేషన్ భర్తిస్తుందని, అందుకు ప్రజల నుంచి ఫీజు వసూలుచేయడం లేదని కమిషనర్ తెలిపారు.

● కర్ణాటకలో లారీల సమ్మె ఎఫెక్ట్....
నిలిచిన రూ.100 కోట్ల సరకులు

అడయార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): డీజిల్‌పై పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని, రాష్ట్రంలో 19 టోల్ ప్లాజాలను తొలగించాలని తదితర డిమాండ్లతో కర్ణాటక రాష్ట్రంలో లారీల సంఘాల యజమానులు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సమ్మె బుధవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈసమ్మె కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల లారీలు నిలిచిపోయాయి. అలాగే, తమిళనాడు నుంచి కర్ణాటకకు, కర్ణాటక నుంచి తమిళనాడుకు వచ్చే మరో పదివేల లారీల రాకపోకలు కూడా ఆగిపోయాయి. కర్ణాటక రాష్ట్ర లారీ యజమానుల సంఘం ఈ సమ్మెను ముమ్మరం చేసింది. దీంతో తమిళనాడు నుంచి ఉత్తరాది రాష్ట్రాలతో పాటు కర్ణాటకకు ఎగుమతి, దిగుమతయ్యే సరకుల రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ముఖ్యంగా కోడిగుడ్లు, చికెన్, పసుపు, జవ్వరిసి, జౌళి, అగ్గిపెట్టెలు, కిరాణా సరకులు, కూరగాయల తదితర సరకులు స్తంభించిపోయాయి. వీటి విలువ రూ.100 కోట్ల మేరకు ఉండొచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, నిరవధిక సమ్మెలో పాల్గొన్న లారీల యజమానులతో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి, రవాణా శాఖ ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

హల్వా వ్యాపారి కుటుంబంలో వరకట్నం వేధింపులు

● అల్లుడిపై ఇరుట్టుకడై హల్వాదుకాణం యజమానురాలి ఫిర్యాదు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇరుట్టుకడై హల్వా యజమాని కవితా సింగ్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరం నెల్లయప్పర్ ఆలయం ఎదుటనున్న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'ఇరుట్టుకడై హల్వా' దుకాణం యజమాని కుమార్తెను అల్లుడు కట్నం కోసం వేధిస్తున్నాడనే ఫిర్యాదుపై ఆ నగర పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఈ విషయమై ఆ దుకాణం యజమానురాలు కవితాసింగ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన కుమార్తె శ్రీకనిష్కను కోయంబత్తూరుకు చెందిన బలరామ్ సింగ్ అనే యువకుడికిచ్చి ఫిబ్రవరి రెండున వివాహం జరిపించామని తెలిపారు. అల్లుడు బలరామ్‌సింగ్ ప్రస్తుతం విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడని, తరచూ స్వస్థలానికి వచ్చి తన కుమార్తెను కట్నం కోసం వేధిస్తున్నాడని, అతడి కుటుంబీకులు కూడా చిత్రహింసలు పెట్టి పనిమనిషి కంటే హీనంగా చూస్తున్నారని ఆరోపించారు. అల్లుడు బలరామ్‌సింగ్‌కు మరో యువతితో వివాహేతర సంబంధం ఉందని, ఆ యువతిని ఇంటికి తీసుకొచ్చి ఆమె ఎదుటే తన కుమార్తెపై వేధింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. వీటన్నింటి కంటే తిరునల్వేలిలో ఉన్న ఇరుట్టుకడై హల్వా దుకాణాన్ని తనకు రాసిస్తేనే కాపురం చేస్తానంటూ బెదరిస్తున్నాడని తెలిపారు. ఈ వివరాలతో తాను కుమార్తెతోపాటు తిరునల్వేలి నగర పోలీసు కమిషనర్‌కు, ముఖ్యమంత్రి ప్రత్యేక ఫిర్యాదుల విభాగానికి వినతి పత్రాలు అందజేసినట్లు కవితా సింగ్ తెలిపారు. ఇక అల్లుడు బలరామ్‌సింగ్, అతడి కుటుంబీకులు తమకు బీజేపీ నాయకుల మద్దతు ఉందని బెదిరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

కాశిమేడు హార్బర్‌లో పోలీసుల గస్తీ

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడు షిఫింగ్ హార్బర్‌లో వాషర్‌మెన్‌పేట అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ నేతృత్వంలో 30 మంది పోలీసులతో 24 గంటలు బందోబస్తు ఏర్పాటైంది. కాశిమేడు షిపింగ్ హార్బర్ నుంచి 1,200 మరపడవల్లో సుమారు 2,000 మందికి పైగా జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్తుంటారు. సముద్రపు జీవుల సంతానోత్పత్తి కోసం ప్రతి ఏడాది 61 రోజులు చేపల వేటపై నిషేధం విధిస్తుంటారు. ఈ ఏడాది నిషేధకాలం బుధవారం నుంచి ప్రారంభమై జూన్ 14వ తేది వరకు కొనసాగనుంది. ఈ కాలంలో జాలర్లు తమ పడవలను తీరంలో లంగరు వేసి ఉంచి, మరమ్మతులు చేపడుతుంటారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకొనేలా హార్బర్‌లోని ఐదు ప్రవేశద్వారాల వద్ద భద్రత కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

మంత్రి పొన్ముడిని డిస్మిస్ చేయాల్సిందే

● అన్నాడీఎంకే మహిళా విభాగం ధర్నా



చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఓ బహిరంగ సభలో శైవ, వైష్ణవ మతాలను, మహిళలను కించపరిచేలా ప్రసంగించిన మంత్రి పొన్ముడిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే మహిళా విభాగం కార్యకర్తలు చెప్పులతో ధర్నా నిర్వహించారు. ఇటీవల విల్లుపురం సమీపంలో తందై పెరియార్ ద్రావిడర్ కళగం ఏర్పాటు చేసిన ఓ సభలో మహిళల ఎదుటే శైవ, వైష్ణవ మతాలవారు ధరించే చిహ్నాలను కించపరిచే విధంగా, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం సైదాపేట పానగల్ మాళిగై ఎదుట మాజీమంత్రి వలర్మతి ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. మాజీ మంత్రి గోకుల ఇందిరా, మహిళా విభాగం కార్యకర్తలు సుమారు రెండు వందలమంది ఈ ధర్నాలో పాల్గొన్నారు.

మంత్రి పదవి నుంచి పొన్ముడిని తొలగించాలంటూ పిటిషన్

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శైవ, వైష్ణవ మత చిహ్నాలను కళంకపరిచేలా మాట్లాడిన మంత్రి పొన్ముడిని పదవి నుంచి తొలగించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ద్రావిడ కళగం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేది జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్ముడి, శైవ, వైష్ణవ మత చిహ్నాలు, మహిళలను కించపరిచేలా మాట్లాడడం చర్చనీయాంశమైంది. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన నేపథ్యంలో, ఆయనను పార్టీ పదవి నుండి తొలగిస్తూ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, మంత్రి పొన్ముడిని పదవి నుంచి తొలగించాలని కోరుతూ న్యాయవాది పి.జగన్నాథ్ మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేశారు. అందులో.. ప్రజా ప్రతినిధిగా మంత్రి వ్యాఖ్యలు రాజ్యాంగానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ పిటిషన్ ఈ నెల 24వ తేది విచారణకు రానుంది.

రాష్ట్రంలో కుల గణన జరపాల్సిందే

● పీఎంకే నేత అన్బుమణి డిమాండ్


స్తంభస్థాపన పూజలో పాల్గొన్న అన్బుమణి

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయాన్ని కాపాడేలా రాష్ట్రంలో కులాల వారీగా జనగణన నిర్వహించాల్సిందేనని పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెంగల్పట్టు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతమైన మహాబలిపురంలో వచ్చే మే నెల 11వ తేదీన పీఎంకే మహానాడు నిర్వహించనున్న నేపథ్యంలో, బుధవారం ఉదయం స్తంభస్థాపన కార్యక్రమం అన్బుమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2021లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన హామీల్లో 40శాతం కూడా అమలుపరచకుండా ప్రజలను మభ్యపెట్టేలా రోజుకొక సాకు చెబుతూ, కాలం వెళ్లబుచ్చుతోందని విమర్శించారు. సామాజిక న్యాయాన్ని, 69శాతం రిజర్వేషన్లను కాపాడేలా రాష్ట్రంలో కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో పీఎంకే ఉంటుందా? అని మీడియా ప్రశ్నించగా అన్బుమణి మౌనం దాల్చారు. మీడియా ప్రతినిధులు తరచితరచి అడగ్గా.. కూటమిపై త్వరలో నిర్ణయం చెబుతానన్నారు.

అల్పాహారంలో మార్పు

● ఉప్మాకు బదులు పొంగల్, సాంబారు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారంలో ఉప్మాకు బదులు పొంగల్, సాంబారు అందించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా పలు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, అల్పాహారం పథకంలో మార్పులు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, బియ్యం ఉప్మాకు బదులు పొంగల్, సాంబారు ఇవ్వాలని నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఈ మార్పు అమలుకు రానుందని అధికారులు తెలిపారు.

రెండోరోజూ మంత్రులపై అవిశ్వాసానికి అన్నాడీఎంకే పట్టు

కుదరదన్న స్పీకర్ ● నిరసనగా ప్రతిపక్ష ఎమ్మెల్యేల వాకౌట్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రులు సెంథిల్‌బాలాజీ, పొన్ముడి, కేఎన్ నెహ్రూపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు రెండోరోజైన బుధవారం కూడా అన్నాడీఎంకే అసెంబ్లీలో పట్టుబట్టింది. వారి అభ్యర్థనను స్పీకర్ అప్పావు నిరాకరించడంతో అందుకు నిరసనగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఇదే విషయమై మంగళవారం అన్నాడీఎంకే సభాపక్ష ఉపనాయకుడు ఆర్బీ ఉదయకుమార్ ఆ ముగ్గురు మంత్రులను తొలగించాల్సి ఉందని, తామిచ్చిన నోటీసును పరిశీలించి అవిశ్వాస తీర్మానానికి పట్టుబట్టిన విషయం తెలిసిందే. స్పీకర్ అప్పావు ససేమిరా కుదరదన్నారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులంతా సభ నుండి వాకౌట్ చేశారు.ఇదే రీతిలో బుధవారం ఉదయం అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ముగ్గురు మంత్రులకు వ్యతిరేకంగా తామిచ్చిన నోటీసు ప్రకారం సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని స్పీకర్ అప్పావుపై ఒత్తిడి చేశారు. స్పీకర్ అప్పావు బదులిస్తూ అరగంట ముందే నోటీసు ఇచ్చి వెంటనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కుదరదని, దీనికి తోడు సభలో కీలకమైన శాఖలకు సంబంధించిన ఆర్థిక ఉప పద్దులపై చర్చలు జరిపి ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ సమాధానంతో సంతృప్తి చెందని అన్నాడీఎంకే సభ్యులందరూ వాకౌట్‌చేశారు. ఈపీఎస్ సభ నుండి వాకౌట్ చేస్తుండగా అన్నాడీఎంకే సభ్యులందరూ స్పీకర్ అప్పావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● అన్బు ఇల్లం జప్తు వ్యవహారం....
నటుడు ప్రభు పిటిషన్‌పై తీర్పు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నటుడు శివాజీ గణేశన్ ఇంటిని (అన్బు ఇల్లం) జప్తు చేయాలనే ఉత్తర్వులు రద్దుచేయాలని కోరుతూ నటడు ప్రభు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు వాయిదా వేసింది. 'జగజాల్ కిల్లాడి' చిత్ర నిర్మాణానికి నటుడు శివాజీగణేశన్ మనవడు ధుష్యంత్ తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రూ.9.39 కోట్లు తిరిగి చెల్లించలేదనే పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, శివాజీగణేశన్ ఇల్లు జప్తు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, ఆ ఇల్లు తనకు సొంతమని, ఇంటిని జప్తు చేయాలనే ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ నటుడు ప్రభు మద్రాసు హైకోర్టులో పిటిషన్ శారు. ఈ కేసులో ధుష్యంత్ తండ్రి రామ్‌కుమార్, ఆ ఇంటిపై తనకు ఎలాంటి హక్కు, వాటా లేదని హైకోర్టులో ప్రమాణపత్రం దాఖలుచేశారు. ఈ కేసు న్యాయమూర్తి అబ్దుల్ ఖుద్దూస్ విచారించగా నటుడు ప్రభు తరఫున హాజరైన న్యాయవాది... ఆ ఇంటి హక్కులు పూర్తిగా ప్రభుకు ఉన్నాయని, రామ్‌కుమార్‌కు ఎలాంటి వాటా లేదన్నారు. ఇల్లు జప్తు చేయాలని న్యాయస్థానం ఉత్తర్వులకు ముందే, శివాజీగణేశన్ ఆ ఇంటి ప్రభుకు రాసి ఇచ్చారని, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు, అందువల్ల జప్తు ఉత్తర్వులు రద్దుచేయాలని కోరారు. అందుకు అభ్యంతరం తెలిపిన ప్రతివాది ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ తరఫున హాజరైన న్యాయవాది... పలు కోట్ల విలువైన 22 గ్రౌండ్ల ఇంటి స్థలంపై ఎలాంటి హక్కులు లేదని పేర్కొనడం నమ్మశక్యంగా లేదన్నారు. ఆ ఇంటి హక్కులు పూర్తిగా ప్రభుకు చెందాయా? అన్న విషయమై పూర్తిస్థాయి విచారణ చేపట్టే వరకు జప్తు ఉత్తర్వులు రద్దు చేయరాదని వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం న్యాయమూర్తి.... తేది ప్రకటించకుండా తీర్పు వాయిదావేశారు.

పుచ్చకాయల్లో ఎలాంటి రసాయనాలు కలపడం లేదు

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయల్లో ఎలాంటి రసాయనాలు కలపడం లేదని మద్రాసు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. రాష్ట్రంలో ఎండలు అధికమవుతున్న కారణంగా ప్రజలు పుచ్చకాయలు, పండ్ల రసాలు సేవిస్తున్నారు. ప్రజలను ఆకర్షించేలా ఎరుపు రంగుతో కూడిన పుచ్చకాయలు విక్రయించేలా వ్యాపారులు వాటిలో రసాయనాలు కలుపుతున్నారంటూ ఆహార భద్రతా శాఖ అధికారులు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. అధికారుల దాడుల కారణంగా పుచ్చకాయల విక్రయాలు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. ఈ నేపథ్యంలో చెంగల్పట్టు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... పుచ్చకాయలు ఎరుపుగా, రుచితో ఉండేలా రసాయనాలు కలుపుతున్నట్లు మాట్లాడి, ప్రజల మధ్య ఆందోళన రేకెత్తించేలా వ్యవహరించిన ఆహార భద్రత శాఖ అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, పుచ్చకాయలు ప్రభుత్వమే కొనుగులో చేసి తగిన గిట్టుబాటు ధర అందించేలా చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి భరత్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం విచారించగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పుచ్చకాయలు పరిశీలించామని, వాటిలో ఎలాంటి రసాయనాలు వాడడం లేదని నిర్ధారణ అయిందని ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. ఆ ప్రకారం, పుచ్చకాయలపై ప్రజల్లో ఏర్పడి భయాందోళనలు నివారించేలా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపింది. అనంతరం న్యాయమూర్తి... పిటిషనర్ ఆరోపణలపై బదులు పిటిషన్ దాఖలుచేయాలని ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్‌కు ఆదేశిస్తూ, తదుపరి విచారణ జూన్ 9వ తేదీకి వాయిదావేశారు. అలాగే, పుచ్చకాయల రైతులకు ఏర్పడిన భర్తీచేసేలా, పుచ్చకాయల్లో ఎలాంటి రసాయనాలు కలపడం లేదని ప్రజలకు అవగాహన కల్పించేలా పత్రికల్లో ప్రకటనలు జారీచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో ప్రభుత్వాన్ని ఆదేశించారు.

కు.ని ఆపరేషన్ చేసుకున్న మహిళకు శిశువు

రూ.60 వేలు నష్టపరిహారం చెల్లించాలి ● హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళకు శిశువు జన్మించిన నేపథ్యంలో, ఆమెకు రూ.60 వేలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా సంబంధిత వైద్యుడికి హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు చేసింది. తూత్తుకుడి జిల్లాకు చెందిన రాజా సుబ్రమణ్యం దాఖలు చేసిన పిటిషన్‌లో, తూత్తుకుడి జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో 2018వ సంవత్సరం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న తన భార్య రెండేళ్ల అనంతరం మళ్లీ గర్భం దాల్చి ఆడశిశువుకు జన్మనిచ్చిందని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాల్సిందిగా పిటిషనర్ అభ్యర్థించారు. బుధవారం ఈపిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి లక్ష్మినారాయణన్ పిటిషనర్ దంపతులకు ఇప్పటికే ఇద్దరుపిల్లలున్నారని 2018లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న అనంతరం మళ్లీ పిల్లలెలా పుడతారని వైద్యశాఖను ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వ జీవో ప్రకారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఫలించకపోతే బాధితురాలికి రూ.60 వేలు నష్టపరిహారాన్ని రెండువారాల్లోపు చెల్లించాలని తూత్తుకుడి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి కుటుంబ సంక్షేమ అధికారికి ఉత్తర్వులు జారీచేశారు.

కేసరి పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో హెచ్‌ఎం నాగుల గోపాలయ్య, టీచర్లు

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ ఎం ఎం ఎస్) పరీక్షా ఫలితాల్లో టీనగర్ కేసరి పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. గత ఫిబ్రవరిలో ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో నగరంలోని సుమారు 200 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ,విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో అర్హత సాధించిన 164 మందిలో టీనగర్ కేసరి పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులున్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ సాధించిన ఈ విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య మాట్లాడుతూ, మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు శారద, చందుమతి, లక్ష్మి, జానకి, శశిధర్ ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారి విజయం కోసం కృషిచేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కె.ఎస్వీప్రసాద్, టీచర్లు శారద, చందుమతి, లక్ష్మి, శశిధర్, జానకి తదితరులు పాల్గొన్నారు.

గుట్కా కేసులో సీబీఐకి ఉత్తర్వులు

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుట్కా కేసులో పెన్‌డ్రైవ్ ద్వారా పంపిణీ చేసిన అదనపు చార్జిషీటుపై వివరణ ఇవ్వాల్సిందిగా సీబీఐ చెన్నై ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అధికారులకు లంచం ఇచ్చి, నిషేధాజ్ఞలను ఉల్లంఘించి గుట్కా విక్రయించేందుకు సహకరించాలని ఆరోపిస్తూ అప్పటి మంత్రులు వీవీ రమణ, విజయ్‌భాస్కర్ సహా 26 మందికి వ్యతిరేకంగా సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుపై గత నాలుగేళ్లుగా విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో సాక్షుల విచారణ ముగిసింది. మరోవైపు గుట్కా కేసులో సంబంధాలున్న 26 మందిపై పెన్‌డ్రైవ్ ద్వారా సీబీఐ అదనపు చార్జిషీటు న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో, దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలంటూ సీబీఐకు ఉత్తర్వులు జారీచేసిన చెన్నై ప్రత్యేక కోర్టు, ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

పుళల్ జైల్లో సెల్‌ఫోన్, గంజాయి స్వాధీనం

పెరంబూర్,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారం ప్రాంగణంలో సెల్‌ఫోన్, గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జైలు ప్రాంగణంలోని వాచ్‌టవర్ సమీపంలో బుధవారం ఉదయం పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న సమయంలో పొదల మధ్య ఉన్న ప్యాకెట్‌ను గమనించి జైలు అధికారులకు తెలియజేశారు. అధికారులు అక్కడకు చేరుకుని ప్యాకెట్ పరిశీలించగా, అందులో ఒక సెల్‌ఫోన్, 39 గ్రాముల గంజాయి గుర్తించారు. జైలు అధికారుల ఫిర్యాదుతో పుళల్ పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి, ఈ ప్యాకెట్‌ను బయట నుంచి జైల్లో విసిరిన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

అగ్నిగుండ వేడుకల్లో అపశ్రుతి

● గాయపడిన పారిశ్రామికవేత్త మృతి


పారిశ్రామికవేత్త కేశవన్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం సమీపం తెర్కుకాట్టూరు ప్రాంతంలోని మారియమ్మన్ ఆలయ పంగుణి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అగ్నిగుండ ప్రవేశ వేడుకల్లో నిప్పులు తొక్కేందుకు ప్రయత్నిస్తూ జారిపడిన పారిశ్రామికవేత్త కేశవన్ (56) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం వేకువజాము మృతి చెందాడు. ఈ నెల 10న భక్తులతోపాటు ఆయన అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆ సందర్భంగా కాలుజారి మండుతున్న నిప్పులపై పడ్డారు. వెంటనే ఆలయ నిర్వాహకులు, అగ్నిమాపక సిబ్బంది ఆయనను కాపాడి చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయిదు రోజులుగా చికిత్స పొందుతున్న కేశవన్ చికిత్స ఫలించక మృతి చెందారు. రామనాథపురం కేణిక్కరై పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

కాలేజీ విద్యార్థినికి కత్తిపోట్లు

అడయార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో ఒక విద్యార్థినిని ప్రేమోన్మాది కత్తితో పొడిచాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రేమించుకుని, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన ప్రియుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు... సేలం జిల్లా కారియపట్టికి చెందిన సూర్య (20) అనే యువతి బీఎస్సీ చదువుతోంది. ఆట్టయంపట్టికి చెందిన మోహన్ ప్రియన్ (19) అనే యువకుడు ఐటీఐ పూర్తి చేసి ఉపాధి కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో సూర్య, మోహన్ ప్రియన్‌ల మధ్య ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో సూర్యకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తన ప్రియుడుతో మాట్లాడటం మానేసింది. దీన్ని జీర్ణించుకోలేని ప్రియన్ ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో సూర్య సేలం పాత బస్టాండు వద్ద ఉండగా ప్రియన్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఆ తర్వాత తాను కూడా అదే కత్తితో తన చేతులను కోసుకున్నాడు. రక్తపుమడుగులో పడివున్న వారిద్దరినీ అక్కడవున్న వారు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మూడో అంతస్తు నుంచి జారిపడి దంపతుల మృతి

అడయార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కేంద్రంలోని ఒక హోటల్ మూడో అంతస్తు నుంచి జారిపడి ఉత్తరాదికి చెందిన ఓ జంట మృతిచెందింది. గుజరాత్ రాష్ట్రానికి చెందిన 15 మంది మహిళల సహా మొత్తం 26 మంది బృందం రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలను చూసేందుకు వచ్చింది. ఈ క్రమంలో వీరంతా కన్నియాకుమారికి చేరుకుని స్థానికంగా ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, బుధవారం ఉదయం తాము బసచేసిన గది కిటికీ తలుపులు తెరిచేందుకు పాపారియా హరిలాల్ లాల్జీ (73), ఆయన భార్య పాపారియా హన్సా బకేన్ (64) ప్రయత్నించారు. వారు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఆ కిటికీ తలుపులు రాకపోవడంతో మరింత సాహసం చేసి తెరిచేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో లాల్జీ ప్రయత్నించగా, భర్తకు భార్య సాయం చేసింది. అయితే, వీరిద్దరూ ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి జారిపడటంతో ప్రాణాలు కోల్పోయారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చోరీ చేసిందని ఆరోపణలు
మెడికో ఆత్మహత్య


అనుప్రియ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగదు చోరీ చేసేందనే ఆరోపణలు తట్టుకోలేని వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. తిరువణ్ణామలైకి చెందిన గోవిందరాజ్ కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఆయన కుమార్తె అనుప్రియ (19) కోవై పీలమేడులోని ప్రైవేటు కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య కోర్సు చదువుతోంది. అలాగే, కళాశాల ఆస్పత్రిలో శిక్షణ పొందుతోంది. కొద్దిరోజుల క్రితం అనుప్రియ బసచేస్తున్న గదిలో నగదు కనిపించకుండా పోయింది. ఈ నగదు అనుప్రియ దొంగిలించిందని సహచర విద్యార్థుల ఫిర్యాదుతో కళాశాల యాజమాన్యం అనుప్రియను విచారించింది. అప్పటినుంచి మనస్తాపంగా ఉన్న అనుప్రియ, మంగళవారం మధ్యాహ్నం ఆస్పత్రిలో శిక్షణకు వెళ్లి, అకస్మాత్తుగా భవనంలోని 5వ అంతస్తుకు వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పీలమేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవై ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తరగతి గదిలో విద్యార్థిపై కత్తితో దాడి

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో సహ విద్యార్థిపై కత్తితో దాడికి పాల్పడిన 8వ తరగతి విద్యార్థికి న్యాయస్థానం 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళ్తే, తిరునల్వేలి జిల్లా పాళయంకోటలో వున్న ఓ ప్రైవేటు మెట్రిక్యులేషన్ పాఠశాలలో సుమారు వెయ్యిమందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ ఎనిమిదో తరగతి చదువుకుంటున్న ఇద్దరి విద్యార్థుల మధ్య గత కొన్నిరోజులుగా విభేదాలు ఏర్పడినట్లు సమాచారం. మేళపాళయంకు చెందిన ఓ విద్యార్థికి, కృష్ణాపురానికి చెందిన మరో విద్యార్థి మధ్య పెన్సిల్ కోసం తలెత్తిన ఘర్షణ విషయం తెలిసి, పాఠశాల యాజమాన్యం వారిని గట్టిగా మందలించింది. ఈ నేపథ్యంలో, కృష్ణాపురానికి చెందిన విద్యార్థి మంగళవారం తరగతి గదికి కత్తి తీసుకువెళ్లి మేళపాళయం విద్యార్థిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోడానికి ప్రయత్నించిన టీచర్ రేవతి (44)కి చేతికి గాయాలయ్యాయి. అనంతరం దాడికి పాల్పడిన విద్యార్థి పాళయంకోట పోలీసుస్టేషన్‌కు వెళ్ళి లొంగిపోయి, కత్తి అప్పగించాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి, టీచర్లను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, దాడికి పాల్పడిన విద్యార్థిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, విచారణ అనంతరం ఈ నెల 24వ తేదీ వరకు 14 రోజులపాటు జువెనల్ హోంకు తరలిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు.

బీజేపీ నేషనల్ యూత్ వింగ్ అధ్యక్షుడిగా అన్నామలై?

అడయార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు కె.అన్నామలై నియమితులు కాబోతున్నారంటూ ఆ పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగోతుంది. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న అన్నామలై పదవీకాలం ముగియడంతో ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెల్సిందే. దీంతో అన్నామలైకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలను అప్పగించవచ్చన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ యూత్ వింగ్ నేషనల్ ప్రెసిడెంట్ బాధ్యతలను అప్పగించవచ్చంటూ సమాచారం.



రజిషా విజయన్

పాత్ర కోసం 15 కేజీలు తగ్గిన హీరోయిన్ !

మలయాళ నటి రజిషా విజయన్ ఒక సినిమాలో పాత్ర కోసం ఏకంగా 15 కేజీల బరువు తగ్గారు. ఇందుకోసం ఆమె కఠినమైన ఆహార నియమాలతో పాటు వ్యాయామాలు చేసి, నాజూగ్గా మారినట్టు తాజాగా వెల్లడించారు. ధనుష్ హీరోగా నటించిన 'కర్ణన్' చిత్రం ద్వారా తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమైన ఈ భామ.. ఆ తర్వాత సూర్య 'జైభీమ్', కార్తి 'సర్దార్', తెలుగులో రవితేజతో 'రామారావు ఆన్ డ్యూటీ'తో సహా అనేక చిత్రాల్లో నటించారు. అయితే, 2024లో ఆమె నటించిన ఒక్క చిత్రం కూడా రిలీజ్ కాలేదు. దీనికి కారణం ఆమె కాస్త బొద్దుగా ఉండడమే. ఈ నేపథ్యంలో ఇపుడు కార్తి హీరోగా తెరకెక్కుతున్న 'సర్దార్-2'లో అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ఛాన్స్ ఇచ్చే ముందు దర్శకుడు పెట్టిన షరతును ఆమె అంగీకరించి సంతకం చేశారు. ఈ మూవీలో పాత్ర కోసం 'స్లిమ్'గా తయారుకావాలన్నదే ఆ షరతు. అందుకు తగినట్టుగానే రజిషా... ఎంతగానో శ్రమించి అతి స్వల్పకాలంలో స్లిమ్‌గా తయారయ్యారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'దర్శకుడు సూచన మేరకు నా పాత్ర కోసం స్లిమ్‌గా తయారయ్యాను. ఇందుకోసం కఠినమైన ఆహార నియమాలను పాటించాను. ఆరు నెలల్లో నాలో ఎంతో మార్పు వచ్చి నాజూగ్గా తయారయ్యాను' అని పేర్కొంటూ రెండు ఫొటోలను ఆమె షేర్ చేశారు.

చిత్రజ్యోతి

'పొరునై' పురావస్తు పరిశోధన డాక్యుమెంటరీ

● హిప్‌హాప్ ఆది

కోలీవుడ్ సినీ సంగీత దర్శకుడు, హీరో, నిర్మాత, దర్శకుడిగా రాణిస్తున్న హిప్‌హాప్ ఆది దేశంలోనే తొలిసారి పురావస్తు పరిశోధనపై డాక్యుమెంటరీ ఫిల్మ్ తయారు చేశారు. 'పొరునై' పేరుతో రూపొందించిన ఈ డాక్యుమెంటరీని ముందుగా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నట్టు ఆయన వెల్లడించారు. తాజాగా జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'ఈ డాక్యుమెంటరీ తయారు చేయడానికి నాలుగేళ్లు పట్టింది. తమిళ వర్ణమాల ఎలా ఆవిర్భవించిందన్నదానిపై సాగే ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. 2021లో రాష్ట్రంలోని పురావస్తు ప్రాంతాలను గుర్తించి, పరిశోధనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇది తమకు ఎంతో అనుకూలంగా మారింది. తమ పరిశోధన రాతియుగం నాటి అనేక అంశాలను తేటతెల్లం చేస్తుందన్న నమ్మకం తమకు ఉంది. ఇక నా సినిమాల విషయానికి వస్తే, 'మూక్కుత్తి అమ్మన్' సినిమాకు సంగీతం అందిస్తున్నాను. 'జో' ఫేం హరిహరన్ రామ్ దర్శకత్వంలో మరో కొత్త చిత్రంలో నటించనున్నాను. వీటితో పాటు మరికొన్ని ప్రాజెక్టుల కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి. వాటి వివరాలను త్వరలో వెల్లడిస్తాం. నా మ్యూజిక్ వరల్డ్ టూర్‌లో భాగంగా, తొలిదశ పర్యటన విజయవంతంగా పూర్తి చేశాం. రెండో దశ టూర్ త్వరలోనే ప్రారంభించి డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం. నేను సినిమాల్లోకి రాకముందు నుంచి ఇండిపెండెంట్ స్వరకర్తగా ఉన్న సమయం నుంచి మీడియా అన్ని రకాలుగా మద్దతిస్తూ వస్తోంది. వారందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు.



సంగీత దర్శకురాలిగా మారిన సింగర్



శక్తిశ్రీ గోపాలన్

ప్రముఖ సినీ నేపథ్యగాయని శక్తిశ్రీ గోపాలన్ తన సినీ ప్రయాణంలో మరో సాహసోపేతమైన అడుగు వేశారు. ఒకవైపు నేపథ్య గాయనిగానే రాణిస్తూ మరోవైపు సంగీత దర్శకురాలిగా మారారు. వైనాట్ స్టూడియోస్ పతాకంపై నిర్మాత శశికాంత్ నిర్మించి, దర్శకత్వం వహించిన 'టెస్ట్' మూవీద్వారా మ్యూజిక్ డైరెక్టరుగా సంగీత ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆర్.మాధవన్, సిద్ధార్థ్, నయనతార, మీరా జాస్మిన్ వంటి తారాగణం ఇందులో నటించగా, ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో తన విలక్షణమైన గాత్రంతో పాటలను పాడుతూ శ్రోతలను ఉర్రూతలూగిస్తున్నారు. ఇపుడు సంగీత స్వరకర్తగా తన ప్రత్యేకమైన కళాత్మకను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'టెస్ట్' మూవీ కోసం పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. దీనికి అవకాశమిచ్చిన దర్శక నిర్మాత శశికాంత్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన నా గురువులకు, నా కుటుంబ సభ్యులకు, కళాకారులకు, టెక్నీషియన్లకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

గుమ్మడికాయ కొట్టేసిన 'ఎల్ఐసీ'

ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (ఎల్ఐసీ) చిత్రీకరణ పూర్తి చేసుకుంది. వాస్తవానికి ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ చేసినప్పటికీ అనేక వివాదాల్లో చిక్కుకుంది. 'ఎల్ఐసి' అనే టైటిల్‌ను పెట్టేందుకు భారత బీమా కంపెనీ (ఎల్ఐసి) అడ్డుచెప్పింది. దీంతో టైటిల్‌ను 'లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ'కి బదులు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'గా పేరు మార్చారు. ఆ తర్వాత మూవీ బడ్జెట్ పెరిగిపోవడంతో ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంది. ఇలా అనేక ఇబ్బందులను అధిగమించి ఎట్టకేలకు చిత్రీకరణ పనులను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుంది. ఇప్పటికే ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసిన చిత్రబృందం.. మూవీని సెప్టెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో ప్రదీప్ రంగనాథన్ సరసన కీర్తిశెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇతర పాత్రల్లో యోగిబాబు, ఎస్‌జే సూర్య, గౌరీ కిషన్ తదితరులు నటించారు. సెవెన్ స్క్రీన్ స్టూడియోస్, రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా ఈ సినిమా నిర్మిస్తున్నాయి. 'డ్రాగన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ప్రదీప్ రంగనాథన్ నటిస్తున్న చిత్రం కావడంతో దీనిపై అంచానాలు కూడా భారీగానే ఉన్నాయి.

ప్రదీప్ రంగనాథన్






తమిళంలోనే సంతకాలు

● ప్రభుత్వ ఉద్యోగులు చేయాలంటూ జీవో

● ప్రకటనలు, జీవోలు, ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ మాతృభాషలోనే

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఇక నుంచి తమిళంలోనే సంతకం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు తదితర నేమ్ బోర్డులు తప్పనిసరిగా తమిళంలో ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు తమిళం తప్పనిసరి అంటూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. తమిళ అధికార భాషా చట్టానికి ప్రజలు నిర్మొహమాటంగా అభిప్రాయాలు తెలియజేయాలని సూచించింది. 1956లో చట్టంగా రూపొందించి 1957 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కానీ, నేమ్ బోర్డు, లేఖలు, ప్రత్యుత్తరాలు మాత్రం తమిళంలో జరగడం లేదు. దీనిపై దృష్టి సారించిన తమిళ అభివృద్ధి శాఖ... ప్రభుత్వ ఉద్యోగులు తమిళంలో సంతకం చేయాలని, ప్రభుత్వ ప్రకటనలు, జీవో తమిళంలో ఉండేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు తమిళ అభివృద్ధి, సమాచార శాఖ తరఫున విడుదల చేసిన ప్రకటనలో... తమిళ అధికార భాషా చట్టం సక్రమంగా అమలుచేసేలా అన్ని ప్రభుత్వ శాఖలు ప్రకటనలను తమిళంలో విడుదల చేయాలి. ఆయా శాఖలు ప్రభుత్వానికి ఇచ్చే సర్క్యులర్లు కూడా తమిళంలోనే ఉండాలి. ప్రజలు తమిళంలో అందించే వినతిపత్రాలకు తమిళంలోనే సమాధానం ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగులు అన్ని శాఖల్లోనూ తమిళంలోనే సంతకాలు చేయాలని, సచివాలయ అధికారులు ఆంగ్లంలో ఇచ్చే ప్రభుత్వ ఉత్తర్వులను తమిళ అభివృద్ధి, సమాచార శాఖలో ఉన్న అనువాద విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమిళ పద, వ్యాకరణ దోషాలు లేకుండా ఉన్నాయని నిర్ధారించిన తరువాతే వాటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

హొగెనేకల్‌లో పెరిగిన ఇన్‌ఫ్లో



జలపాతం వద్ద నీటి ఉధృతి

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కావేరి నదీ పరీవాహక ప్రాంతాల్లో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా హొగెనేకల్ జలపాతానికి వచ్చే నీటి పరిమాణం విపరీతంగా పెరిగింది. మంగళవారం ఆ జలపాతంలోకి సెకనుకు 1500 ఘనపుటడుగుల చొప్పున జలాలు వస్తున్నాయి. బుధవారం ఉదయం అంజెట్టి, కేర్జి, నాట్రాంపాళయం, రాశిమలై, బిలిగుండ్లు తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఇన్‌ఫ్లో ఉన్నట్టుండి పెరిగింది. ఉదయం 8 గంటలకు ఆ జలపాతంలోకి సెకనకు 2 వేలఘనపుటడుగుల చొప్పున జలాలు ప్రవేశించాయి. దీంతో ప్రధాన జలపాతం, ఐందరువి, సీనాఫాల్స్ తదితర జలపాతాల్లో జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం బిలిగుండ్లు ప్రాంతం వద్ద కేంద్ర నీటి వనరుల శాఖ ఉన్నతాధికారులు నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో సమావేశమైన ఎంఎన్ఎం నేత కమల్‌హాసన్, ఉపాధ్యక్షుడు ఏజీ మౌర్యా, ప్రధాన కార్యదర్శి ఎ.అరుణాచలం

విజయంలో ఆనందాన్ని పంచుకోవడానికే కలుసుకున్నా

● సీఎం స్టాలిన్‌తో భేటీపై కమల్‌హాసన్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, 'మక్కల్ నీదిమయ్యం' నాయకుడు కమల్‌హాసన్ సచివాలయంలో బుధవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ గవర్నర్‌కు వ్యతిరేకంగా జరిపిన న్యాయపోరాటంలో ముఖ్యమంత్రి స్టాలిన్ గెలిచిన ఆనందోత్సాహంలో తాను కూడా పాలుపంచుకోవడానికే ఆయనతో సమావేశమయ్యానని కమల్ పేర్కొన్నారు. గవర్నర్ విధులు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి ఉన్న అధికారాలు, మంత్రివర్గం నిర్ణయాలను గవర్నర్ శిరసావహించాలని సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు రాష్ట్రానికే కాకుండా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందన్నారు. ఇంతటి చారిత్రాత్మక తీర్పును సాధించినందుకు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అభినందనలు తెలియజేశానని కమల్ తెలిపారు. స్టాలిన్‌తో నియోజకవర్గాల పునర్విభజన గురించి తానెలాంటి చర్చలు జరుపలేదన్నారు. అదే విధంగా రాజ్యసభ సీటును కోరే విషయమై కూడా స్టాలిన్‌తో మాట్లాడలేదని, అసెంబ్లీ ఎన్నికలకు కూడా యేడాది గడువు ఉండటంతో ఈ రెండు విషయాలు ప్రస్తావించలేదని కమల్ తెలిపారు.

గూడువాంజేరిలో జీఆర్టీ షోరూం ప్రారంభం



ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆసాధారణమైన హస్తకళకు ప్రసిద్ధి చెందిన జీఆర్టీ జూవెలర్స్ సంస్థ నగర శివారులోని గూడువాంజేరిలో బుధవారం తన 63వ షోరూం ప్రారంభించింది. బంగారం, వజ్రం, ప్లాటినమ్, రత్నాలు, వెండి ఆభరణాలు లభించే ఈ షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని జీఆర్టీ సంస్థ తమ కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తోంది. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.250 తగ్గింపు, పాత బంగారంపై గ్రాముకు రూ.75, డైమండ్ విలువపై క్యారెట్‌కు రూ.12,500 చొప్పున రాయితీ కల్పించింది. అలాగే వెండి వస్తువులు, నెక్లెస్‌ల కోసం మేకింగ్ ఛార్జీలపై 25 శాత తగ్గింపు, అన్‌కట్ వజ్రాల ధరపై 10 శాతం తగ్గింపు, వెండి ఆభరణాలకు ఎమ్మార్పీ ధరలపై 10 శాతం తగ్గింపు వంటి అనేక ఆఫర్లు అందిస్తోంది. 1964లో జీఆర్టీని జూవెలరీ సంస్థ ప్రారంభించినప్పటి నుండి స్వచ్ఛత, నైపుణ్యాన్ని కొనసాగిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. 60 సంవత్సరాల విశిష్ఠమైన నాణ్యత, విశ్వాసంతో దక్షిణ భారతదేశం, సింగపూర్‌లో తనకంటూ ఓ ఖ్యాతిని కలిగిన విశిష్ఠ ప్రయాణంలో నూతనంగా ప్రారంభించిన గూడువాంజేరి షోరూం మైలురాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పుస్తక పఠనంపై ప్రోత్సాహం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ మోడల్ ప్రభుత్వ ప్రజల్లో పఠనాశక్తి ప్రోత్సహించేలా చర్యలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు.ఈ మేరకు ఆయ న తన 'ఎక్స్' పేజీలో పోస్ట్ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి... స్థానిక మెరీనా తీరం సమీపంలో రూ.39.40 లక్షలతో ఆధునికీకరించిన శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఈ గ్రంథాలయంలో పిల్లల్లో పఠనాశక్తి పెంచేలా 'కామిక్స్ కార్నర్' తదితర వసతులు ఏర్పాటుచేశామన్నారు. ప్రజలు ఈ గ్రంథాలయం వినియోగించుకోవాలని ప్రేమతో ఆహ్వానిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, చెన్నై కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఎన్.సిట్రరసు, జోనల్ కమిటీ అధ్యక్షులు ఎస్.మదన్‌మోహన్, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా.పి.సుందరమోహన్, పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పి.శంకర్ సహా పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 9 మందికి 'పోషకుడు' సర్టిఫికేట్లను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అందజేశారు.



'పోషకుడు' సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉదయనిధి, చిత్రంలో మంత్రి అన్బిల్ మహేష్

వైద్య కోర్సులు ప్రారంభించిన ఆర్ఎండీ అకాడమీ



ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'ఆర్ఎండీ అకాడమి ఫర్ హెల్త్' ఆధ్వర్యంలో పలు వైద్య కోర్సులు అందిస్తున్నారు. టి.నగర్ హబీబుల్లా రోడ్డులో ఆధునిక తరగతి గదు లు, ల్యాబొరేటరీ సౌకర్యంతో కూడిన సెంటర్‌ను సీనియర్ ఫిజియోలజిస్ట్ డా.శంబులింగం, 'లక్ష్య' ఫౌండర్ నిఖిల్‌పంత్ బుధవారం ప్రారంభించారు. మున్సిపల్, గ్రామీణ విద్యార్థులకు వైద్య కోర్సులు అందించేలా ఈ సెంటర్ ఏర్పాటైందని, జెరియాట్రిక్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, పల్లియేటివ్ కేర్ అసిస్టెంట్, ఫ్లెబోథమిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎమర్జెన్సీ కేర్ టెక్నీషియన్ తదితర కోర్సులు అందించనున్నట్లు, ఆయా రంగాల్లో నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారని, కోర్సులు పూర్తిచేసిన వారిని 100 శాతం ఉపాధి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీరంగంలో చిత్తిరై రథోత్సవం

● వైభవంగా ముహూర్త స్తంభస్థాపన



రథం వద్ద పూజలు చేస్తున్న పూజారులు

ప్యారీస్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలో భూలోక వైకుంఠంగా పేరుగాంచిన శ్రీరంగం క్షేత్రంలో ఈ నెల 26వ తేదీ చిత్తిరై రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ముహూర్త స్తంభస్థాపన పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున ప్రారంభకానున్న చిత్తిరై ఉత్సవాలు 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో ప్రతిరోజు నంబెరుమాళ్‌ను ప్రత్యేకంగా అలంకరించి, వివిధ వాహనాల్లో మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలు విజయవంతం కావలని కోరుతూ చిత్తిరై వీధిలోవున్న రథం వద్ద ముహూర్త స్తంభస్థాపన పూజలు వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 26వ తేదీ వేకువజాము 5.15గంటలకు నిర్వహించనున్నట్లు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ శివరామ్‌కుమార్ తెలిపారు.

అధికమవుతున్న మధుమేహం కేసులు



మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ భరణీధరన్, డాక్టర్ అరవిందన్‌సెల్వరాజ్, డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఊబకాయం, ఆహార నియమాలు పాటించకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నవారంతా తమ పూర్వీకులకు మధుమేహం లేదు కనుక తమకు అలాంటి బాధలు ఉండవనే అపోహతోనే ఉన్నట్లు ఇటీవల డయాబెటీస్ ఆన్ వీల్స్ ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడైనట్లు ఆళ్వార్‌పేట కావేరి హాస్పిటల్ వైద్యనిపుణుడు డాక్టర్ భరణీదరన్ తెలిపారు. బుధవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వంద రోజుల్లో నగరంలోని 3971 మంది వద్ద మధుమేహంపై అభిప్రాయ సేకరణ జరిపినట్లు చెప్పారు. ఆ సర్వేలో 21 శాతం మంది టైప్2 మధుమేహంతో బాధపడుతున్నట్లు వెల్లడైందని, దీనికి కారణం మారిన ఆహారపు అలవాట్లేనని చెప్పారు. 55.1 శాతం మంది మహిళలకు గర్భధారణ సమయంలో బ్లడ్‌షుగర్ అధికమవుతున్నట్లు తమ అధ్యయనంలో వెల్లడైనట్లు చెప్పారు. మధుమేహంపై అవగాహన లోపం వల్ల నగరంలో మధుమేహం కేసుల సంఖ్య అధికమవుతోందని ఆయన చెప్పారు. మీడియా సమావేశంలో కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్‌సెల్వరాజ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి తదితరులు పాల్గొన్నారు.

డా.అగర్వాల్ డైరెక్టర్ డాక్టర్ సూసన్ జేకబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు



డాక్టర్ సూసన్ జేకబ్

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సూసన్ జేకబ్‌కు 'ది ఆప్తమాలజిస్ట్ పవర్‌లిస్ట్ 2025'లో స్థానం లభించింది. ప్రపంచ దేశాల్లో 10 మంది అత్యుత్తమ నేత్రవైద్యులను ఎంపిక చేసే ప్రచురించే 'ది ఆప్తమాలజిస్ట్' పత్రిక ఈ యేడాదికి గాను ఎంపిక చేసినవారిలో ఈమె కూడా ఉన్నారు. భారతదేశం తరఫున ఎంపికైన ముగ్గురు నేత్రవైద్యుల్లో డాక్టర్ సూసన్ జాకబ్ ఒకరు. ఇంతటి గౌరవాన్ని దక్కించుకున్న ఆమెకు ఆ ఆస్పత్రి ఛైర్మన్ ప్రొఫెసరక్ అమర్ అగర్వాల్, ఆసుపత్రి సహోద్యోగులు పుష్పగుచ్ఛాలతో ప్రశంసించారు.

వీహెచ్‌ఎస్‌కు ఆర్‌సీఎంటీ రూ.1.27 కోట్ల విరాళం



విరాళం అందిస్తున్న ఆర్‌సీఎంటీ నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): స్థానిక తరమణిలోని 'వాలంటీర్ హెల్త్ సర్వీస్' (వీహెచ్‌ఎస్)కు 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టీనగర్ (ఆర్ సీ ఎం టీ) రూ.1.27 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించింది. రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఎంసీకేఎస్ ట్రస్టుతో కలిసి ఈ విరాళం అందించినట్లు వారు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్ భాటియా నేతృత్వంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సుగల్ చంద్ జైన్, ఆర్‌సీఎంటీ అధ్యక్షుడు నరేంద్ర శ్రీమల్, వీహెచ్‌ఎస్ కార్యదర్శి ప్రొఫెసర్ సురేష్, రోటరీ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ వసుధ రాజశేఖర్, డాక్టర్ పూర్ణిమ, ప్రసంచంద్ జైన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో వినతులను సత్వరం పరిష్కరించండి

● పోలీసు కమిషనర్ అరుణ్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

పెరంబూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను సంబంధిత స్టేషన్ అధికారులు సత్వరం విచారించి పరిష్కరించాలని కమిషనర్ అరుణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్ పోలీసుల సమస్యలు తెలుసుకొనేందుకు ప్రతి మంగళవారం, ప్రజల సమస్యలు తెలిపేలా బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ 29 వినతిపత్రాలు స్వీకరించారు.